క్లుప్తంగా

నేడు ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

మరికల్/ధన్వాడ: మండల కేంద్రాల్లోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎం నాగరత్నమ్మ, పీడీ అనంతసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

17 నుంచి క్రీడా పోటీలు

నారాయణపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి రెండు రోజుల పాటు మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు జరుగుతాయని ఆసక్తి గల వారు పాల్గొనవచ్చన్నారు. మండలంలోని జాజాపూర్ జడ్పీ స్కూల్ మైదానంలో ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డు, బోనఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లుల జమ

మరికల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించిన మొదటి విడత బిల్లులు సోమవారం బ్యాంకు ఖాతాలో జమకావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలంలోని బూడ్దెగాని, గాజులయ్యతండాలోని పలువురు లబ్ధిదారులకు మొదటి బిల్లు కింద రూ.లక్ష చొప్పున జమ చేయడంతో మిగితా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. మరికొంత మంది లబ్ధిదారులకు ఈ నెల చివరి నాటికి వారి ఖాతాలో జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కొండన్న తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మన్‌నాయక్, లలితమ్మ, అనూష, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రధాని పుట్టినరోజును ఘనంగా నిర్వహిద్దాం

నర్వ: ప్రధాని మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహిద్దామని బీజేపీ జిల్లా నాయకులు కుర్వ సత్యం పిలుపునిచ్చారు. సోమవారం నర్వలో నిర్వహించిన సేవాపక్షం కార్యశాలలో బూత్ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులనుద్దేశించి మాట్లాడారు. ఈ నెల 17న మోదీ జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జెండా ఆవిష్కరణ అనంతరం కేక్ కటింగ్, రక్తదాన శిబిరం కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకురాలు లలితమ్మ, ప్రధాన కార్యదర్శి విజయ్‌రామ్, సేవా పక్షం కన్వీనర్ నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మాగనూర్: పట్టణంలో ఆదివారం జరిగిన ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ సెలక్షన్స్ పోటీలలో మండల పరిధిలోని నేరడగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 22 నుంచి 24 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

బహుమతుల పంపిణీ

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ లాంగ్వేజ్ లో వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్, పాటలు, నృత్య పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సల్మాన్ రాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మరికల్: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, మరికల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. దేవరకద్రకు చెందిన బోయ పరుశురామ్ అనే యువకుడు మరికల్ నుంచి ఆటోలో 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రాయచూర్‌కు తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా రేషన్‌బియ్యంను తరలిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసిన్నట్లు ట్రైనింగ్ ఎస్‌ఐ మహేశ్వరీ తెలిపారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం

నారాయణపేట టౌన్: జిల్లా వికలాంగులు, వయో వృద్ధులు, మరియు ట్రాన్స్ జెండర్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్ లక్ష్మీకాంత్, సంధ్య మాట్లాడుతూ.. డ్రగ్స్‌తో బంగారం లాంటి జీవితాలు నాశనం అవుతాయని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



నారాయణపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా దివ్యాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పింఛను ఇవ్వాలని కోరారు. హామీని అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, మాధవ్, రాజు, బాలరాజు, రంగప్ప, కృష్ణ, శివప్ప, ఆనంద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

మక్తల్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతుల పింఛ



మక్తల్‌లో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

న్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మక్తల్ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు ఆసరా పెన్షన్ రూ.4 వేలు తీవ్ర వైకల్యం గల వారికి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పథకంలో దివ్యాంగులకు 200 పని దినాలు కల్పించి తేలిక పనులు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ మంద నర్సింహ, మండల అధ్యక్షుడు జాన్ ప్రకాశ్, వెంకటేశ్, గణేశ్ అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

మరికల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్లు పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాంకోటికి వినతిపత్రం అందజేశారు.

హామీలు అమలుచేయాలి

మాగనూర్/మద్దూరు: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని వీహెచ్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కర్రెప్ప అన్నారు. తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మణిగిరి కృష్ణ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శివన్న జన్మదినం.. ప్రత్యేక కార్యక్రమాలు



నారాయణపేట: మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం నారాయణపేట నియోజక వర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.శివారెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. శివన్న జన్మదినం సందర్భంగా చేపట్టే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి హాజరవుతారన్నారు. వేడుకల్లో భాగంగా ఉదయం 07:30 గంటలకు నారాయణపేటలోని లింగయ్య దేవాలయంలో అభిషేకం, 08:30 గంటలకు సాయి విజయ కాలనీలోని షిరిడి సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు, 9 గంటలకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం, 9:30 అశోక్ నగర్‌లో లయన్స్ క్లబ్ భవనంలో పలు సేవా కార్యక్రమాలు, 11 గంటలకు అభినందన్ గార్డెన్‌లో నారాయణపేట-కొడంగల్-ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షల నష్ట పరిహారం ఇస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 11:30 గంటలకు మోటివేషనల్ స్పీకర్ మల్లేష్‌తో నాయకత్వ లక్షణాలపై పాజిటివ్ ఆటిట్యూడ్ పై స్పీచ్ అనంతరం శివన్నతో కేక్ కటింగ్, కార్యకర్తలకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఉదయం 10.30 గంటలకు నారాయణపేటలోని అభినందన గార్డెన్‌కు చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యాత్రదానం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్: తెలంగాణ ఆర్టీసీ ఇటీవల ప్రారంభించిన యాత్రాదానం వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక సీవీయర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రం ప్రవేశ పెట్టని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టేందుకు నిర్ణయించిందన్నారు. దీనివల్ల అనాథలు, నిరాశ్రాయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులు పుణ్యక్షేత్రాల పర్యటనకు దాతల విరాళం ద్వారా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు విరాళం అందించి ఇందుకు సహకరించాలన్నారు. డీఎం లావణ్య, సిబ్బంది ఆంజనేయులు, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతాయుత సేవలతోనే గుర్తింపు



తిమ్మారెడ్డికి స్టార్ చిహ్నాన్ని అలంకరిస్తున్న ఎస్పీ

నారాయణపేట/దామరగిద్ద: ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందిస్తే సమాజంలో పోలీసుల పట్ల గౌరవ మర్యాదలు పెరుగుతాయని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిమ్మారెడ్డి ఏఎస్‌ఐగా పదోన్నతి పొందడంతో సోమవారం తిమ్మారెడ్డికి ఎస్పీ వన్ స్టార్‌ను అలంకరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

మక్తల్: మక్తల్-కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.20 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించడం పట్ల సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరిల చిత్రపటాలకు రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు చేసిన ఉద్యమాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం పెంచడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. మూడు నియోజకవర్గాల రైతులు ఆనందంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ హన్మంతు, కాంగ్రెస్ నాయకులు కట్టసురేశ్, రమేశ్, గణేశ్ కుమార్, రాజప్పగౌడ్, ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి, ఫయాజ్, నాగరాజు, నాగేందర్, అస్మొద్దీన్, రమేస చెన్నయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నారాయణపేట రూరల్: మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూనిర్వాసితులకు పరిహారం పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని సోమవారం బీకేఎస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ముందు ఎకరానికి రూ.14 లక్షలు చెల్లిస్తామని ప్రకటించగా చాలా మంది రైతులు అభ్యంతరం చెప్పడంతో మంత్రి, ఎమ్మెల్యే చొరవతో ప్రస్తుతం రూ.20 లక్షలు ఇవ్వడానికి అంగీకరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు రైతాంగం తరఫున ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, నగర అధ్యక్షులు వెంకటప్ప, ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పర్ణికారెడ్డిను సన్మానిస్తున్న నాయకులు

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి



నర్వ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

నర్వ: మాదాసీ, మాదారి కుర్వలకు ఎస్సీ కుల ధ్రువీకరణపత్రం ఇవ్వాలని సోమవారం నర్వలో కుర్వ కులస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ.. సంచార జీవితం గడుపుతూ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్న కుర్వ కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. 2024 ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తమ కులస్తులను గ్రూప్-3 లో చేర్చినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం మాదాసీ, మాదారి కుర్వ కులస్తులకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నర్వ మండల మాదాసీ, మాదారి కుర్వ సంఘం నియోజకవర్గ నాయకులు సత్యం, మండల అధ్యక్షుడు జనార్దన్, బాల్‌రాజు, మల్లేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు మినహాయింపు ఇవ్వండి



నారాయణపేట/నారాయటపేట టౌన్: ఎన్‌సీడీ ఆన్‌లైన్ ప్రోగ్రాం నుంచి తమను మినహాయించాలని ఏఎన్ఎంలు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జోషి మాట్లాడుతూ ఎన్‌సీడీ ఆన్‌లైన్ ప్రోగ్రాం వల్ల ఏఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కావునా ప్రభుత్వం ఎన్‌సీడీ ప్రోగ్రాం నుంచి వారిని మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ పీఆర్డీ జిల్లా నాయకులు కాశప్ప ఏఎన్ఎం యశోద పాల్గొన్నారు.

మద్దూరులో కోతుల పట్టివేత



మద్దూరు: పట్టణంలో గత 15 రోజులుగా కోతుల బెడద ఎక్కువ కావడంతో కమిషన్ శ్రీకాంత్ చర్యలు చేపట్టారు. నెల్లురూ నుంచి ప్రత్యేక బృందాన్ని పిలిపించి సోమవారం కోతుల పట్టే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు 6 కోతులను, ఒక పిల్ల కోతిని బోనులో బంధించారు. అనంతరం వాటిని హైదరాబాద్‌లోని జూపార్కుకు తరలించారు. ఇంకా నాలుగు కోతులు ఉన్నాయని వాటిని పట్టుకొంటామని తెలిపారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

మద్దూరు: పట్టణంలో కోతుల దాడిలో మరో వ్యక్తికి గాయాలైన ఘటన సోమవారం తహసీల్దార్ కార్యలయం దగ్గర చోటు చేసుకుంది. రసూల్ అనే అతను పనినిమిత్తం తహసీల్దార్ కార్యాలయం దగ్గరకి రావడంతో అక్కడ చెట్లపై ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. బాధితుడికి తీవ్ర గాయాలు కావడంతో మద్దూరు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలి

నారాయణపేట టౌన్: దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కాశప్ప అన్నారు. ఈ మేరకు సోమవారం ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో డీఎస్ఓ బాల్‌రాజ్‌కి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో దాదాపు పదివేలకు పైగా దివ్యాంగుల కుటుంబాలున్నాయని, వీరందరూ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారేనన్నారు. వీరికి అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేస్తే ప్రస్తుతం అందుతున్న రేషన్ బియ్యంతో పాటు ఇతర సదుపాయాలు అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్పీఆర్డీ జిల్లా సహాయ కార్యదర్శి బస్వరాజ్, జిల్లా నాయకులు బాబు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

దామరగిద్ద: మండల తహసీల్దార్ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ తిరుపతయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మోహన్, నరేష్ మాట్లాడుతూ కార్యాలయానికి పనుల నిమిత్తం ప్రజలకు కూర్చోవడానికి కూర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



యూరియా కోసం జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

మరికల్: యూరియా కోసం రైతులు మరికల్‌లో సోమవారం రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. ఆగ్రో రైతు సేవా కేంద్రానికి 400 బస్తాలు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున్న ఆగ్రో రైతు సేవా కేంద్రానికి చేరుకున్నారు. అయితే ముందుగా టోకన్లు పొందిన రైతులకు అధికారులు యూరియాను పంపిణీ చేశారు. టోకెన్లు ఉండి కూడా యూరియా దొరకపోవడంతో ఆగ్రహంతో రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. ప్రతి ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా దిగుమతి చేసి రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు రాస్తారోకోను విరమింపజేసి టోకెన్లు లేని వారికి టోకెన్లు ఇచ్చారు. రెండు రోజుల్లో మరో 400 బస్తాల యూరియా తెప్పించి పంపిణీ చేస్తామని ఏఓ రహ్మాన్ తెలుపడంతో రైతులు శాంతించారు.

విద్యారంగ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

మక్తల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని మంత్రి వాకిటి శ్రీహరికి డీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని మంతన్‌గోడ్ పాఠశాలకు పీడీ పోస్టును మంజూరు చేయాలని, కృష్ణ పీఎస్‌కు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే బీసీ కాలనీల్లోని పాఠశాలలను 5 వ తరగతికి అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అకాడమిక్ అన్‌స్ట్రక్టర్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర, జిల్లా అధ్యాపకురాలు హైమావతి, కార్యదర్శి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యుడు పరందరాములు పాల్గొన్నారు.

పాఠశాలలకు చదరంగం బోర్డుల పంపిణీ

మక్తల్: విద్యార్థులలో మేధస్సు పెంపొందించేందుకు చదరంగం క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మక్తల్‌లో పాలమూరు ఎన్నారై ఆధ్వర్యంలో నిర్వహించిన బోర్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బద్రీనాద్ చల్లను అభినందించారు. అనంతరం విద్యార్థులకు చదరంగం బోర్డులను అందజేశారు. కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, ఎంఈఓ అనిల్‌గౌడ్, రవికుమార్, గణేశ్‌కుమార్, నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి సతీశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బకాయి పడిన రూ.8300 కోట్లను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చాలగటం ఆడుతుందని విమర్శించారు. పేద విద్యార్థులను చదువుకు దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఇంతియాజ్, వెంకటేష్, మురళీధర్, గణేష్, వంశి పాల్గొన్నారు.

సీనియర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

నారాయణపేట రూరల్: పదిహేనేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ప్రతి సీనియర్ ఉపాధ్యాయుడికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. 2010 సంవత్సరానికి ముందు ఉద్యోగంలో ప్రవేశించిన ప్రభుత్వ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. టెట్ పరీక్షపై దేశ అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం ఐదేళ్ల కంటే ఎక్కువ సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు తమ క్యాడర్‌లో అవసరమైన టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలని చెప్పడం కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు. 2010కి ముందు వృత్తిలో ప్రవేశించిన వారికి ఎన్సిటీఈ సంబంధిత పరీక్షకు మినహాయింపు ఇచ్చింది. అవే మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి ఉపశమనం కలిగేలా అత్యున్నత న్యాయ స్థానం ఇచ్చిన తీర్పుపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మేలు చేయాలని కోరారు. జిల్లాల నుంచి ఉపాధ్యాయుల అభిప్రాయాలు సేకరించి కలెక్టర్ల ద్వారా ప్రధానికి వినతిపత్రం పంపిస్తామన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

నారాయణపేట రూరల్: డ్రగ్స్, గంజాయి, మద్యం నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి పి.రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ విమర్శించారు. డ్రగ్స్, గంజాయి, మద్యంను నిషేధించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ సిక్తా పట్నాయక్కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాలను సేవిస్తూ యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని, పల్లె, పట్టణం అనే తేడా లేకుండా డ్రగ్స్, గంజాయి, మద్యం ఏరులై పారుతున్నాయని విమర్శించారు. రూ.వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని, విద్యా సంస్థల్లో మత్తు పదార్థాల వాడకాన్ని గుర్తించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని, ఇకనైనా మేలుకొని మత్తుపదార్థాలకు యువత బానిస కాకుండా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్ష్మి, సత్యమ్మ, మంజుల, సునీత, సిద్దు, రాము, మధు, అజయ్, వెంకటేష్, మహేష్ మైపాల్, సురేష్, రమేష్, రాజు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

నారాయణపేట రూరల్: ప్రజలు సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ కురుమన్న అన్నారు. మండలంలోని అప్పక్‌పల్లిలో సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలకు పాల్పడే అవకాశాలు పెరిగిపోతున్నాయని, అప్రమత్తతో వాటిని అరికట్టేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మొబైల్ యాప్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ వేదికగా మోసాలు జరిగే అవకాశం ఉండడంతో వాటిని వీలైనంత తగ్గించుకోవాలన్నారు. ఫోన్ కాల్స్ ద్వారా బ్యాంక్ ఓటిపి, పాస్వర్డ్ ఇతరులకు షేర్ చేయరాదన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లు గుర్తిస్తే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసులు అశోక్, ప్రదీప్, ఆనంద్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.